సాక్షి
కాకినాడ

ఆదివారం । 10 । నవంబర్ । 2024



నిత్యాన్నదానానికి రూ.1,01,116


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కుటుంబ సభ్యులతో కలసి శ్రీరామమూర్తి (హైదరాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



రూ.2 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని మూలనిధికి దాత ఎ.రాజేశ్వర్‌రెడ్డి దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

కడలిలోకి 44 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 44,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 1,100, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఇద్దరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



ఉమామహేశ్వరరావు



లక్ష్మీనారాయణ

కిర్లంపూడి/గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలోని ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. కిర్లంపూడి మండలం తామరాడ జెడ్పీ హెచ్‌ఎస్ ప్లస్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న బావిశెట్టి లక్ష్మీనారాయణ, గోకవరం మండలంలోని సంజీవయ్యనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాయుడు ఉమామహేశ్వరరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న యూనియన్ బ్యాంక్ జీఎం రమణ

కాకినాడ రూరల్: పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం జనరల్ మేనేజర్ జీవీ రమణ కోరారు. జాతీయ క్లస్టర్ ఎంఎస్‌ఎంఈ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయిలో వివిధ ఎంఎస్‌ఎంఈల ఉత్పత్తులకు సంబంధించి 195 క్లస్టర్ల అభివృద్ధిపై బెంగళూరు నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం వర్చువల్‌గా కార్యక్రమం నిర్వహించారు. కాకినాడలో సత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక రమణయ్యపేటలోని ఒక హోటల్ నుంచి బ్యాంకర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ విశాఖపట్నం జోనల్ కార్యాలయం డీజీఎం శంకర్ హేంబ్రం మాట్లాడుతూ, తమ జోన్ పరిధిలోని 12 జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి వనరులు ఉన్నాయని చెప్పారు. వ్యవసాయాధారిత, ఆటోమొబైల్, ఫర్నిచర్, ప్రింటింగ్, ఫార్మా, చిరుధాన్యాలు తదితర క్లస్టర్లకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సాయిమనోహర్, ఎస్‌బీఐ ఆర్‌ఎం తపోధన్ దేహేరి, కెనరా బ్యాంక్ ఆర్‌ఎం ఆర్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.75 నాణెం సేకరణ



అమలాపురం టౌన్: దేశంలో హిందీ అధికార భాషగా గుర్తించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కోల్‌కత్తా టంకశాల రూ.75 నాణేన్ని విడుదల చేసింది. అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ దానిని సేకరించారు. ఈ నాణెం 35 గ్రాముల బరువుతో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింకుతో తయారైంది.

తమ్ముడూ.. మళ్లీ కుమ్ముడు

- టీడీపీలో సీనియర్లకు భంగపాటు
- కీలక పదవులు ఎగరేసుకుపోతున్న జనసేన
- మొన్న సుధీర్‌కు సివిల్ సప్లైస్ చైర్మన్ గిరీ
- నేడు తుమ్మలకు కౌడా చైర్మన్ పదవి
- బాబు వైఖరిపై రగిలిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- ఎస్సీ, బీసీలకు పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై మండిపాటు





పిల్లి అనంతలక్ష్మి



కర్రి వెంకట్రాజు



తుమ్మల రామస్వామి (బాబు)



వీవై దాసు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నమ్ముకున్న తమ్ముళ్లను తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు షరా మామూలుగానే మరోసారి వంచనతో కుమ్మేశారు. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం శనివారం నామినేటెడ్ పదవుల రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో టీడీపీ సీనియర్లకు మొండిచేయి చూపించారు. జనసేన నేతలకే అగ్రతాంబూలం ఇచ్చారు. దీనిపై తెలుగు తమ్ముళ్లు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. తాజా జాబితాలో జిల్లాలో తెలుగుదేశం నుంచి ఒక్కరంటే ఒక్కరికీ కూడా చోటు స్థానం కల్పించకపోవడంపై ఆ పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఇదే పంథా కొనసాగిస్తే తమ రాజకీయ భవిష్యత్తుపై పునరాలోచన చేయాల్సి వస్తుందని, తమ దారి తాము వెతుక్కోవలసి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ఎస్సీ, బీసీ వర్గాల నేతలైన తాము పార్టీ నేతల పల్లకీ మోయడానికే తప్ప పదవులకు పనికిరామా అని అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. తమను గడ్డిపోచల్లా తీసి పారేస్తున్నారని అసంతృప్తికి గురవుతున్నారు. కూటమి కోసం క్షేత్ర స్థాయిలో అనేక త్యాగాలకు సిద్ధపడటమే తాము చేసిన పాపమా అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జనసేన ఖాతాలోనే రెండు చైర్మన్‌గిరీలు

తాజా పదవుల పందేరంలో జిల్లాకు కేటాయించిన ఒకే ఒక్క చైర్మన్ పదవిని కూడా జనసేన ఎగరేసుకుపోయింది. మొదటి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా కూటమిలో మిత్రపక్షమైన జనసేనకు ఇటీవల కీలకమైన రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు వ్యక్తిగతంగా సన్నిహితుడైన ఆ పార్టీ కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్‌ను ఈ చైర్మన్ పదవికి ఎంపిక చేశారు. తాజాగా విడుదల చేసిన రెండో జాబితాలో సైతం పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి(బాబు)కి కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్మన్ పదవిని కేటాయించారు. ఇలా రెండు కీలక పదవులను జనసేన పార్టీకి కేటాయించి, తమను విస్మరించడమేమిటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇలా జనసేనకే ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జిల్లాలో టీడీపీ భవిష్యత్తును ఏం చేయాలనుకుంటున్నారని, పార్టీకి అడ్రస్ లేకుండా చేస్తారా అని సీనియర్లు అధిష్టానం నిర్ణయాన్ని తూర్పారబడుతున్నారు. చంద్రబాబు నిర్ణయంతో వారు హతాశులవుతున్నారు.

గౌరవానికి గ్యారెంటీ ఏదీ?

జనసేన కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్‌కు పౌర సరఫరాల సంస్థ చైర్మన్ పదవి కట్టబెట్టినప్పుడు, భవిష్యత్తులో తమకు తప్పకుండా అవకాశం దక్కుతుందని చాలా మంది టీడీపీ నేతలు ఆశగా ఎదురు చూశారు. తాజాగా విడుదలైన రెండో జాబితాలో జిల్లాకు కేటాయించిన కౌడా చైర్మన్ పదవిని కూడా జనసేన ఎగరేసుకుపోవడంతో.. ఇక టీడీపీ తరఫున పని చేస్తే తమకు గౌరవం ఉంటుందనే గ్యారెంటీ లేకుండా పోయినట్లయ్యిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అన్ని రకాలుగా జనసేనకు ఇచ్చినంత ప్రాధాన్యం టీడీపీకి ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు.

సీనియర్లకు మొండిచేయి

- సుధీర్, రామస్వామి కంటే టీడీపీలో ఎంతో మంది సీనియర్లు ఉన్నప్పటికీ వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు.
- జిల్లాకు చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పిల్లి అనంతలక్ష్మి, ఆమె భర్త సత్తిబాబుతో పాటు, తిమ్మాపురానికి చెందిన దివంగత కర్రి సత్యనారాయణ తనయుడు కర్రి వెంకట్రాజు, పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, బోళ్ల కృష్ణమోహన్ వంటి సీనియర్లు నామినేడ్ పోస్టులు ఆశించారు.
- వీరిలో బీసీ, మహిళా కోటాలో కౌడా చైర్మన్‌గిరీ తనకు ఖాయమని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆశలు పెట్టుకున్నారు.
- పార్టీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు సహా పలువురు ఎమ్మెల్యేల ఆశీస్సులతో కర్రి వెంకట్రాజు కూడా కౌడా చైర్మన్ సీటు కోసం గట్టి ప్రయత్నాలే చేశారు.
- వాసిరెడ్డి ఏసుదాసు కూడా కార్పొరేషన్ చైర్మన్ ఆశించి భంగపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ రూరల్‌లో జనసేన విజయంలో క్రియాశీలకంగా పని చేసినందుకు చైర్మన్ గిరీ దక్కుతుందనుకుంటే ఇప్పుడు మొండిచేయి ఎదురైందని మండిపడుతున్నారు.

జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు ఇప్పుడు ఆ పార్టీకే రెండు చైర్మన్ పదవులు కట్టబెట్టడాన్ని టీడీపీ నేతలు ఒక పట్టాన జీర్ణించుకోలేకపోతున్నారు. పోనీ పార్టీ నుంచి బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకేమైనా ప్రాధాన్యం ఇచ్చారంటే అది కూడా లేదంటున్నారు. ఈ వరుస పరిణామాలపై టీడీపీ సీనియర్లు ఏం చేస్తున్నారని పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.

శృంగార వల్లభుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: కార్తిక మాసం, అందునా స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో వెలసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పది వేల మందికి ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.5,07,009 ఆదాయం సమకూరిందన్నారు.



స్వామి వారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ప్రశ్నించే గళంపై ఉక్కుపాదం

- సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు
- పలువురి అరెస్టులు
- ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు

'వ్యక్తుల ప్రైవేటు బతుకు
వారివారి సొంతం
పబ్లిక్కులో నిలబడితే
ఏమైనా అంటాం'

– మాట తప్పి, తప్పు దారిలో పయనించే రాజకీయ నాయకులను మహాకవి శ్రీశ్రీ దశాబ్దాల కిందటే తన అక్షర శరాలతో ఇలా చీల్చి చెండాడారు. సామాజిక స్పృహ కలిగిన కవులు, రచయితలు, వివిధ రంగాల్లో ఉన్న సమాజ హితైషులు అదే పంథాలో నేటికీ పయనిస్తూంటారు. ఇంటర్నెట్‌తో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన వర్తమానంలో.. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా కూడా అనేక మంది.. ఏలికల లోపాలను తమకు తోచిన రీతిలో ఎత్తి చూపుతున్నారు. జనసంక్షేమ పథాన్ని వీడిన రాజకీయ నేతలను తిరిగి.. ఆ బాటలో నడిపించడం.. తద్వారా సమాజానికి మేలు చేయడమే వారి సదుద్దేశం. చేస్తున్న విమర్శ జనహితమే అయినప్పుడు అందులోని మంచిని తీసుకుని, లోపాలను సవరించుకోవచ్చు. కానీ, రాజకీయ రంగంపై అసహన పూరిత చీకట్లు పూర్తి స్థాయిలో కమ్ముకున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. అలా మంచి చెప్పడమే నేరంగా కనిపిస్తోంది. పైగా, తాము వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఒప్పు.. ఎదుటి పక్షం చేస్తే తప్పు అనే ధోరణి కనిపిస్తోంది. ఫలితంగానే రాష్ట్రవ్యాప్తంగా విపక్ష వైఎస్సార్ సీపీకి చెందిన అనేక మంది సోషల్ మీడియా కార్యకర్తలకు సంకెళ్లు పడుతున్నాయి. ప్రశ్నించే గళాలు ఉక్కు పాదం కింద నలుగుతున్న దుస్థితి కనిపిస్తోంది. ఇటువంటి ఘటనలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైతం చోటు చేసుకోవడం ప్రజలను కలవరపాటుకు గురి చేస్తోంది.

– అమలాపురం టౌన్/రంగంపేట/గోపాలపురం/జగ్గంపేట

అభ్యంతరకర పోస్టులు పెట్టారని..

సీఎం చంద్రబాబుపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి దంతులూరి రోహిత్‌వర్మపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ పేరుతో ఆయనను రెండుసార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిచి దర్యాప్తు చేశారు. ఆయన స్మార్ట్ ఫోను స్వాధీనం చేసుకుని, అందులోని డేటాను అన్వేషిస్తున్నారు. 'మీకు మీరే ఆ పోస్టింగ్ పెట్టారా.. లేక ఎవరైనా ఒత్తిడి చేసి పెట్టించారా..?' అంటూ వర్మను ప్రశ్నించారు. దీనిలో ఎవరి ఒత్తిడీ లేదని ఆయన పోలీసులకు స్పష్టం చేశారు. క్రమశిక్షణ గల నాయకునిగా పార్టీలో చురుకుగా పని చేస్తారనే గుర్తింపు ఉన్న రోహిత్‌వర్మపై పోలీసులు అన్యాయంగా కేసు నమోదు చేశారంటూ వైఎస్సార్ సీపీ శ్రేణుల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. మాజీ మంత్రి, పార్టీ అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ కూడా రోహిత్‌వర్మపై కేసు నమోదు అంశంపై పోలీసులకు ఫోన్ చేసి ప్రశ్నించారు. వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పైన, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పైన టీడీపీ సోషల్ మీడియా, అధికారిక వెబ్‌సైట్లో అనేక వికృత పోస్టులు పెడుతున్నారు. దీనిపై పోలీసులు ఎటువంటి చర్యా తీసుకోకపోగా, ఏ ఒత్తిళ్లు వచ్చాయో ఏమో కానీ వర్మపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకుని సీరియస్‌గా విచారించారు.



వడిశలేరులో చంద్రశేఖర్ ఆచూకీ కోసం ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులకు మద్దతు తెలుపుతున్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు (ఫైల్)

వైఎస్సార్ సీపీ ఆందోళనతో..

రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన వీరాబత్తుల చంద్రశేఖర్ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ, సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో పోస్టింగ్‌లు పెట్టాడని, గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నూతంగి శ్రీకాంత్ ఆయనపై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో రంగంపేట ఎస్సై కృష్ణసాయి, అనపర్తి సీఐ సుమంత్‌లు బుధవారం ఉదయం చంద్రశేఖర్ భార్య విజయకు ఫోన్ చేశారు. చంద్రశేఖర్ ఫోన్ నంబర్ తీసుకున్నారు. అప్పటి నుంచీ చంద్రశేఖర్ కనిపించకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పకపోవడంతో రంగంపేట పోలీస్ స్టేషన్ ఎదుట ఏడీబీ రోడ్డుపై చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇటీవల ధర్నా చేశారు. దీంతో అనపర్తి సీఐ సుమంత్ ఎట్టకేలకు స్పందించారు. చంద్రశేఖర్‌ను తాము అరెస్టు చేయలేదని దేవరపల్లి సీఐ నాయక్ ఆధ్వర్యంలో గోపాలపురం ఎస్సై సతీష్‌కుమార్ అరెస్టు చేసి, ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారని తెలిపారు. గోపాలపురం పోలీసులు చంద్రశేఖర్‌ను గురువారం కొవ్వూరు కోర్టులో హాజరు పరచి, బెయిల్‌పై విడుదల చేశారు.

అరెస్టు, విడుదల

జగ్గంపేటకు చెందిన కాకరపర్తి శ్రీనివాస్ ఈ ఏడాది మే నెలలో ప్రస్తుత ఎమ్మెల్యే, టీడీపీ నేత జ్యోతుల నెహ్రూను వ్యక్తిగతంగా దూషించి, దుర్భాషలతో కూడిన పోస్టులను సోషల్ మీడియాలో పోస్టు చేశారంటూ గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటకు చెందిన టీడీపీ కార్యకర్త నూగంటి వెంకట రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అప్పటి సీఐ, ఎస్సై కేసు నమోదు చేశారు. దీనిపై శ్రీనివాస్‌కు పలుమార్లు సమాచారం తెలియజేసినప్పటికీ స్పందించలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆయనను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. కాకరపర్తి శ్రీనివాస్‌కు ప్రస్తుత జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ శనివారం నోటీసు జారీ చేసి, అరెస్టు చేసి, వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఆయన ఫోనును స్వాధీనం చేసుకున్నారు.

రత్నగిరి.. భక్తజనఝురి

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- 5,200 వ్రతాల నిర్వహణ
- రూ.50 లక్షల ఆదాయం



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం భక్తజనఝురిని తలపించింది. పవిత్ర కార్తిక మాసంతో పాటు రెండో శనివారం విద్యా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారిని సుమారు 50 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 5,200 జరిగాయి. స్వామివారి నిత్య కల్యాణంలో రూ.1,116 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి 40 మంది భక్తులు పాల్గొన్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక్క వ్రతాల నిర్వహణ ద్వారానే సుమారు రూ.20 లక్షలు రాగా, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.15 లక్షలు, ట్రాన్స్‌పోర్టు ద్వారా రూ.1.35 లక్షల చొప్పున ఆదాయం వచ్చింది. ఇతర విభాగాల ద్వారా మరో రూ.13 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని సన్నిధికి ఆది, సోమవారాలలో లక్ష మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం నవమి, సోమవారం దశమి కావడంతో ఈ రెండు రోజులూ తెల్లవారుజామున ఒంటి గంట నుంచే వ్రతాల నిర్వహణ ప్రారంభించనున్నారు. రెండు గంటల నుంచి స్వామివారి దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు. ఈ రెండు రోజుల్లో 15 వేలకు పైగా సత్యదేవుని వ్రతాలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. వ్రత మండపాలతో పాటు స్వామివారి నిత్య కల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహిస్తారు. అన్ని మండపాల్లోనూ ఏక కాలంలో 1,400 మంది భక్తులు స్వామివారి వ్రతాలు ఆచరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నదాన పథకం వద్ద భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేయనున్నారు.

పంటు పని తీరుపై సంతృప్తి

ఈ నెల 13వ తేదీన సత్యదేవుని తెప్పోత్సవం సందర్భంగా పంపా జలాశయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కూడా ఈఓ రామచంద్ర మోహన్ పరిశీలించారు. తెప్పోత్సవంలో ఉపయోగించే పంటు పని తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 12వ తేదీకల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 15న జరగనున్న సత్యదేవుని గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై కూడా ఆయన సమీక్షించారు. గిరి ప్రదక్షిణ రోడ్డును పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు, ఈఈ రామకృష్ణ, డీఈలు రాంబాబు, ఉదయ్, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఈఓ

దేవస్థానంలో ఏర్పాట్లను ఈఓ కె.రామచంద్ర మోహన్ శనివారం పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. పశ్చిమ రాజగోపురం వద్ద నిర్మించిన విశ్రాంతి షెడ్డులో భక్తుల సదుపాయాలపై ఆరా తీశారు. వ్రత మండపాల్లో వ్రతాల నిర్వహణను పరిశీలించారు. అన్ని మండపాల్లో డ్రెస్ కోడ్‌కు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులు తక్కువగా ఉన్నప్పుడు వారిని క్యూలో ఎక్కువ దూరం నడిపించకుండా నేరుగా కొత్త క్యూ లైన్ లోకి అనుమతించాలని ఆదేశించారు. సత్యదేవుని ఆలయం వద్ద కూడా భక్తులను త్వరగా పంపించేలా చూడాలన్నారు.

తప్పుడు కేసులతో వేధించకండి

- కూటమి పోస్టుల పైనా కఠినంగా ఉండండి
- అడిషనల్ ఎస్పీకి వైఎస్సార్ సీపీ నేత కురసాల కన్నబాబు వినతి



అడిషనల్ ఎస్పీ భాస్కరరావుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులను తప్పుడు కేసులతో వేధించవద్దని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యంగా టీడీపీ, జనసేన కూటమికి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు పోస్టింగ్‌లపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించి వేధింపులకు గురి చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడైనా నిజంగా తప్పు జరిగితే చట్టపరంగా చర్యలు తీసుకోవడాన్ని ఆమోదిస్తామని, అదే సమయంలో కేవలం కక్షసాధింపుతో పోలీసులు అదుపులోకి తీసుకుని వేధించడం సరికాదని అన్నారు. ప్రధానంగా ఇటీవల కొంత మంది సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదైన కేసులను కన్నబాబు ఏఎస్పీ ఎదుట ప్రస్తావించారు. అలాగే జిల్లాలోని కొంత మంది కూటమి పార్టీలకు చెందిన వ్యక్తులు వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకొని పెట్టిన దుర్మార్గమైన పోస్టింగులను ఆధారాలతో అదనపు ఎస్పీకి సమర్పించారు. పరుష పదజాలాన్ని వినియోగిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న కూటమి పార్టీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్-6 హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఇప్పుడు సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారని అన్నారు. అబద్ధాలు వల్లె వేసి ప్రజలను నమ్మించడంలో ఆరితేరిన చంద్రబాబు ఇటువంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగానే అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఇదే విషయాన్ని ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గతంలోనే స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్‌కు స్వస్తి పలికి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చంద్రబాబు ప్రయత్నించాలని కన్నబాబు హితవు పలికారు. ఏఎస్పీని కలిసిన వారిలో కూడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు, మాజీ కార్పొరేటర్లు అజ్జు, గద్దేపల్లి దాసు, నాయకులు ఆదిత్యకుమార్, పుల్లా కోటేశ్వరరావు, కర్రి దుర్గాప్రసాద్‌రెడ్డి, చక్రవర్తి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భవనం పైనుంచి పడి తాపీ కార్మికుడి మృతి



భవనం పైనుంచి పడి మృతి చెందిన సత్యసాయిబాబు

మామిడికుదురు: పాశర్లపూడి గౌతమ్ నగర్‌లో భవనానికి తాపీ పని చేస్తూ కింద పడి అప్పనపల్లి గుత్తులవారిపాలానికి చెందిన కోట సత్యసాయిబాబు (40) శుక్రవారం మృతి చెందాడు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ శనివారం తెలిపిన వివరాల మేరకు మార్లపూడి ఆనందరావుకు చెందిన భవనం పైఅంతస్తులో శుక్రవారం సాయంత్రం సాయిబాబు తాపీ పని చేస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ అతడు కింద పడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

గ్రంథాయల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా వర్మ



కృష్ణ వర్మ

అమలాపురం టౌన్: అమలాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి గాదెరాజు కృష్ణవర్మ రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడపలో శుక్రవారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల్లో వర్మ ఎన్నికయ్యారు. వర్మకు రాష్ట్ర సంఘంలో కీలక పదవి దక్కడంపై ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రత్నాభాయి హర్షం వ్యక్తం చేశారు.

పేకాడుతున్న 19 మంది అరెస్టు

రూ.5.12 లక్షల స్వాధీనం

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామంలోని ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు ఆధ్వర్యంలో నగరం ఎస్సై ఎ.చైతన్య కుమార్ తన సిబ్బందితో దాడిచేసి 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. పేకాడుతున్న వారి వద్ద నుంచి రూ.5,12,880 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు. మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

తూర్పు లక్ష్మీపురం.. శోకసంద్రం

- అడ్డతీగలలోని ఏలేరు కాలువలో గల్లంతైన మృతదేహాలు లభ్యం
- భూషణం ఇంటివద్ద మిన్నంటిన రోదనలు
- చింతా శ్రీనివాస్ మృతదేహం పోస్టుమార్టానికి తరలింపు



చింతా శ్రీనివాస్ ఇంటివద్ద విషాదఛాయలు



భూషణం ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏలేశ్వరం: నిత్యం తమ కళ్లముందు తిరిగే వారు ఒక్కసారిగా దూరం కావడంతో ఆ కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చింది. రోజూ లాగే పనికి వెళ్లిన వారు ఇక తిరిగి రారనే వార్తతో వారి కుటుంబ సభ్యులు చలించిపోయారు. ఇసుక తవ్వకానికి వెళ్లి మృత్యువాత పడడంతో తూర్పులక్ష్మీపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద కాలువలో గల్లంతైన నాలుగు మృతదేహాలలో ఇద్దరివి శుక్రవారమే దొరకగా, వీరమల్లు నాగభూషణం (60), చింతా శ్రీను (19) మృతదేహాలను శనివారం బయటకు తీశారు. భర్త వీరమాల భూషణం మృతితో భార్య లక్ష్మి గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటనలో భర్తతోపాటు కొడుకుని, అల్లుడు చినగొంతియ్యను ఆమె కోల్పోయింది. వాగులో వారు గల్లంతైన దగ్గర నుంచి ఆమె అక్కడే ఉండిపోయింది. ఒకే కుటుంబంలో తండ్రీకొడుకులైన భూషణం, జయబాబు చనిపోవడంతో భార్య లక్ష్మి, కుమారులు శామ్యూల్, అభిషేక్ శోకసంద్రంలో మునిగిపోయారు. మరో మృతుడు చింతా శ్రీను తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వీరికి ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవాడు శ్రీను కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అందివచ్చావు అనుకుంటే తిరిగి రాని లోకాలకు పోయావా నాయనా అంటూ వారు విలపించారు. ఇలావుండగా బయటకు తీసిన రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ముగ్గురిలో భూషణం, జయబాబులకు తూర్పులక్ష్మీపురంలో, చినగొందియ్యకు తన స్వగ్రామం తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.

స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చుకుందాం

- మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేద్దాం
- బ్రహ్మజోస్యుల, క్రొవ్విడి, దీక్షితులు తదితరులు సదా స్మరణీయులు
- సీతానగరం గౌతమి సత్యాగ్రహ ఆశ్రమ శతవార్షిక సభలో వక్తలు



సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శత వార్షికోత్సవంలో స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమం శత వార్షికోత్సవంలో దక్షిణ సబర్మతి - సత్యాగ్రహ ఆశ్రమం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సీతానగరం: స్వాతంత్ర్య సమరానికి డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం తన సర్వస్వాన్ని అర్పించారని, ఆయన స్థాపించిన గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం ఎందరో యోధులకు వేదికగా నిలిచిందని ఆశ్రమం శత వార్షికోత్సవ సభలో వక్తలు పేర్కొన్నారు. 1924 నవంబర్ 9న సీతానగరం గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమానికి శంకుస్థాపన జరిగి సరిగ్గా నేటికి వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలో శనివారం శత వార్షిక సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెలకొల్పిన శతవార్షిక స్థూపాన్ని శాసన సభ మాజీ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మహామహోపాధ్యాయ ప్రాచార్య శలాక రఘునాథ శర్మ, తెలుగు వెలుగు వ్యాస మంజూష గ్రంథకర్త డాక్టర్ అరిపిరాల నారాయణరావు, ఆశ్రమ ప్రతినిధి సుశీల, ఆశ్రమ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ బొంగు రాజారావు, పురావస్తు శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకుడు కె.తిమ్మరాజు కుటుంబ సభ్యులు, డాక్టర్ వంగవీటి వెంకట్రామ దీక్షితులు, చంద్రుపట్ల హనుమంతరావు, అలాగే ఆశ్రమ స్థల దాతల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం దంపతులు, క్రొవ్విడి లింగరాజు దంపతులు, డాక్టర్ దీక్షితులు విగ్రహాలను అతిథులు ఆవిష్కరించి, అంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ బులుసు సాంబమూర్తి ఈ ఆశ్రమ స్థాపనకు సహకరించారని, క్రొవ్విడి లింగరాజు, డాక్టర్ వంగవీటి వెంకట్రామ దీక్షితులు, చంద్రుపట్ల హనుమంతరావు వంటి ఎందరో సమరవీరులు చేసిన పోరాటం అద్వితీయమని, అటువంటి మహనీయులను సదా స్మరిస్తూ ముందడుగు వేయాలని సూచించారు. మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ మన తెలుగు జాతిలో ప్రకాశం పంతులు, డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య వంటి త్యాగధనులు ఎందరో ఉన్నారని, అలాగే స్వాతంత్ర్య సమరంలో సంపాదన వదిలేసి, సర్వస్వం ధారపోసిన మహనీయులు ఉన్నారని గుర్తు చేశారు. అయితే ఇలాంటి వాళ్లకు సరైన గుర్తింపు దేశస్థాయిలో రాలేదన్నారు. పోలీసుల లాఠీ దెబ్బలకు ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోయిన బ్రహ్మజోస్యుల వంటి వారిని మరిచిపోరాదన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామన్నారు. ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ ఎందరికో విద్య, వైద్యం, ఉపాధి కల్పించిన ఈ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని,

ఆచార్య శలాక రూ.లక్ష విరాళం

ఆచార్య శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం తనకు బంధువేనని, కానీ ఆయన మరణం తర్వాత తాను పుట్టానని, ఆయన గురించి ఎన్నో తెలుసుకున్నానని తెలిపారు. వారి వారసుల్లో కూడా బ్రహ్మజోస్యుల వారి త్యాగ బుద్ధి ఉందని సోదాహరణంగా చెప్పారు. ఆశ్రమం అంటే అంతా శ్రమ అని ఆయన పేర్కొన్నారు. మరింత సేవాభావంతో ఆశ్రమం వెలుగొందాలని ఆకాంక్షిస్తూ తన వంతుగా రూ.లక్ష విరాళాన్ని బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఆశ్రమ ప్రతినిధి సుశీలకు అందజేశారు.

డాక్టర్ అరిపిరాలకు క్రొవ్విడి స్మారక పురస్కారం

డాక్టర్ అరిపిరాల నారాయణరావుకు ఈ సందర్భంగా క్రొవ్విడి లింగరాజు స్మారక పురస్కారాన్ని ఆయన మనుమలు క్రొవ్విడి భాస్కరరావు, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, ఇతర కుటుంబ సభ్యులు అందజేసి, ఘనంగా సత్కరించారు. అరిపిరాల మాట్లాడుతూ క్రొవ్విడి లింగరాజు పరిచయంతో ఈ ఆశ్రమంతో అనుబంధం ఏర్పడిందన్నారు. తిమ్మరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, టూరిజం నుంచి నిధులు ఏ మేరకు రాబట్టవచ్చో వివరించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనల తయారీలో తనవంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అతిథులకు, స్వాతంత్ర్య సమర వీరులు, దాతల కుటుంబ సభ్యులను ఆశ్రమం తరఫున సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. గ్రంథ రచయిత డాక్టర్ రాజారావును సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే కోర్పు అచ్చమాంబ, అశోక్ కుమార్ జైన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గౌతమి ఆశ్రమ చరిత్ర పుస్తకావిష్కరణ: డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బొంగు రాజారావు రచించిన దక్షిణ సబర్మతి –గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం పుస్తకాన్ని మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, డాక్టర్ అరిపిరాల నారాయణరావు ఆవిష్కరించారు. నన్నయ వర్సిటీ తెలుగుశాఖ సహాయాచార్యులు తలారి వాసు పుస్తక సమీక్ష చేశారు.

వృద్ధుడికి వాస్క్యులర్ శస్త్ర చికిత్స



శ్యామ్‌కుమార్‌తో వైద్యులు శ్రీరామ్ అమరేంద్రబాబు, సెంటర్ హెడ్ సుభాకర్ తదితరులు

కాకినాడ రూరల్: రోడ్డుపై నడిచి వెళుతున్న వృద్ధుడిని బైక్ ఢీకొట్టడంతో రెండు కాళ్ల దెబ్బతిని రక్త ప్రసరణ నిలిచిపోయింది. గాయాలకు కుట్లు వేయించుకుని వైద్యం పొందుతున్నా చర్మం కుళ్లిపోతూ రెండు కాళ్లూ పనిచేయని స్థితికి చేరాయి. దీంతో తండ్రి వైద్యం కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కుమారుడు గూగుల్ సెర్చ్‌లో అన్వేషించి కాకినాడ అచ్చంపేట జంక్షన్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో సంబంధిత వైద్యం ఉన్నట్టు గుర్తించి చికిత్స చేయించారు. క్లిష్టమైన వాస్క్యులర్ శస్త్ర చికిత్స ద్వారా వైద్యులు కృత్రిమ పైపుతో రెండు కాళ్ళకు రక్త ప్రసరణ పునరుద్ధరించారు. యూనిట్ హెడ్ సుభాకర్ అధ్యక్షతన శనివారం ఆ వివరాలు వెల్లడించారు. మండపేట మండలానికి చెందిన 65 ఏళ్ల ఆకుమర్తి శ్యామ్‌కుమార్‌ను డాక్టర్ ఎస్.శ్రీరామ్ అమరేంద్రబాబు పరిశీలించి బృహద్ధమని (అయోటా) నుంచి కృత్రిమ గ్రాఫ్టులను ఉపయోగించి బైపాస్ సర్జరీ చేశారు. అనస్థీషియా వైద్యుడు కిశోర్‌కుమార్, క్రిటికల్ కేర్ వైద్యుడు జగదీశ్వరరావు, ఇతర వైద్య సిబ్బంది సహకారంతో చికిత్స చేసినట్టు తెలిపారు.

మహిళను ఏమార్చి ఏటీఎం నుంచి నగదు దోపిడీ

రామచంద్రపురం రూరల్: ఒక మహిళను ఏమార్చి ఆమె ఏటీఎం కార్డు తీసుకుని పలు ప్రదేశాల్లో దఫదఫాలుగా రూ.1,04,800 దోచుకున్న ఉదంతం రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కె.మాణిక్యాంబ సెప్టెంబరు 14న ద్రాక్షారామలోని స్టేట్‌బ్యాంకు ఏటీఎంకు నగదు తీయడానికి వెళ్లింది. కార్డును ఏటీఎంలో పెట్టగానే ప్లీజ్ టేక్ యువర్ కార్డు అని చెప్పడంతో ఆమె వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తి చిప్ కనెక్ట్ అవ్వడం లేదని ఆమె నుంచి కార్డును తీసుకుని ఏటీఎంలో పెట్టి రూ.10 వేలు విత్‌డ్రా చేసి ఇచ్చాడు. ఆ తరువాత వెనుక మరొకరు రావడంతో అతనికి అవకాశం ఇవ్వగా ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె కార్డును మార్చి వేరొక కార్డు అమెకి ఇచ్చి వెళ్లిపోయాడు. ఆ తరువాత అన్నాయిపేటలో ఏటీఎం నుంచి రూ.10 వేల చొప్పున మూడు దఫాలు రూ. 30 వేలు తీసుకున్నాడు. ఆ తరువాత యానాంలోని సత్య ఎంటర్‌ప్రైజెస్ పెట్రోలు బంకు నుంచి రూ.10,200 చొప్పున 2 సార్లు, వీరభద్రా ఏజెన్సీస్ పెట్రోలు బంకు నుంచి రూ.10 వేలు ఒకసారి, రూ.10,400 ఒకసారి, నీలిమా ఫ్యూయల్స్ పెట్రోల్ బంకు నుంచి రూ.34,000 మొత్తం రూ.1,04,8000 ఆమె అకౌంట్ నుంచి దోచుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కవులను ప్రోత్సహించడమే లక్ష్యం



కత్తిమండ ప్రతాప్‌ని సన్మానిస్తున్న నన్నయ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్

రాజానగరం: సాహిత్యం జనాన్ని జాగృతం చేయడమే కాకుండా సమాజ హితంగా ఉండాలని శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా శనివారం ఇక్కడకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ జనావళి అంతరంగాలను స్పృశించి, మేలు కొలిపే దిశగా రచనలు చేయాలని వర్ధమాన కవులను ప్రోత్సహించడమే తమ ధ్యేయమన్నారు. జీవితాలను దగ్గరగా చూసినప్పుడే సామాజిక స్పృహ కవిత్వంగా పుట్టుకొస్తుందన్నారు. వర్ధమాన కవులను, యువతను ప్రోత్సహించే దిశగా ప్రతి నెలా ఒక్కో జిల్లాలో జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. తాము చేస్తున్న కృషికి గుర్తింపుగా 32 ప్రపంచ రికార్డులు అందుకున్నామన్నారు. ఈ సందర్భంగా కత్తిమండను నన్నయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు సన్మానించారు.

భారతీయ యువతకు తైవాన్ ఆహ్వానం

- తైవాన్ ఎకనామిక్ కల్చర్ సెంటర్ ప్రతినిధి డాక్టర్ ఎల్‌జే యాంగ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎల్‌జే యాంగ్

రాజానగరం: తైవాన్‌లో యువతకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఈ అవకాశాన్ని భారతీయ యువత సద్వినియోగం చేసుకోవాలని భారతదేశంలోని తైవాన్ ఎకనామిక్ కల్చర్ సెంటర్ ప్రతినిధి డాక్టర్ ఎల్‌జె యాంగ్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, చాట్ జీపీటీలతో కలసి జిజియు అనువర్తనాలపై రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి కార్యక్రమం శనివారంతో ముగిసింది.

ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ యాంగ్ మాట్లాడుతూ తమ దేశంలో యువ జనాభా కొరత తీవ్రంగా ఉన్నందున భారతదేశం నుంచి యువతను ఆహ్వానిస్తున్నామన్నారు. అక్కడ ఉపాధి అవకాశాలకు, ఇంటర్న్‌షిప్‌లకు అనుకూలంగా ఉందన్నారు. సభాధ్యక్షుడు, జీజీయూ చాన్సెలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ తమ విద్యా సంస్థ నుంచి బీటెక్ చేస్తున్న విద్యార్థులు 30 మందిని జనవరి 2025లో తైవాన్ పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా జీజీయూ పరీక్షల విభాగంలో సంపూర్ణ డిజిటలీకరణను యాంగ్ ప్రారంభించారు. ప్రో చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, కన్వీనర్లు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

నల్లజర్ల: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది ఓ భర్త పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. నల్లజర్ల ఏఎస్‌ఐ శ్రీనివాసరావు అందించిన వివరాల మేరకు ఉంగుటూరు మండలం గోకవరం గ్రామానికి చెందిన దెయ్యాల ప్రసాద్ (30)కు అయ్యవరానికి చెందిన మహిళతో వివాహమైంది. ఇటీవల వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె అలిగి పుట్టింటికి వచ్చేసింది. ప్రసాద్ పలుమార్లు ఆమె వద్దకు వెళ్లి కాపురానికి రమ్మని బతిమాలినా ససేమిరా అంది. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ శుక్రవారం తన తమ్ముడు ఉంటున్న అచ్చన్నపాలెం వచ్చి అనంతరం నల్లజర్ల పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న చెరువు వద్ద పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని తొలుత స్థానిక పీహెచ్‌సీకి, అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకుందామా.. వాడపల్లి వాసుని..

- ఆలయాలకు కార్తిక శోభ
- భారీగా వచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వెంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం కార్తిక శోభను సంతరించుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వేద పండితులు, అర్చకులు స్వామివారు, దేవేరులను ప్రత్యేకంగా అలంకరించారు. ఏడు శనివారాల నోము అచరించిన భక్తులు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన చేశారు. వేకువ జాము నుంచే రాష్ట్రం నలు మూలలు నుంచి వచ్చిన వేలాది భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది. సుమారు 50 వేల నుంచి 60 వేల మంది స్వామి వార్ని దర్శించుకున్నారు. ఉదయం 3 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుమారు 35 వేల మంది వరుకు స్వామివారిని దర్శించుకున్నారు. రూ.50 ప్రత్యేక దర్శనాన్ని 16,588, రూ.200 విశిష్ట దర్శనాన్ని 6,713 మంది, రూ.1,116 వేదాశీర్వచనంతో 1261 మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకోగా ఉచితంగా వేలాది మంది దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు సుమారు రూ 45,68,164 ఆదాయం సమకూరింది. మధ్యాహ్నం నుంచి సుమారు ఆ మొత్తం రూ.55 లక్షలకు చేరుతుందని అంచనా. దేవాదాయ ధర్మదాయ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధర్‌రావు ఏర్పాట్లు చూశారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం, మండల కేంద్రం ఆత్రేయపురం శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై ఎస్.రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

డ్వాక్రాలో టోకరామణులు!



పుల్లేటికుర్రులో నిరసన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

- అందినకాడికి రూ.లక్షల స్వాహా
- నష్టపోతున్న సంఘాల సభ్యులు
- రికవరీ చేయలేక అధికారుల సతమతం
- అంబాజీపేట, పుల్లేటికుర్రులలో డ్వాక్రా సొమ్ముల దోపిడీ

అంబాజీపేట: యానిమేటర్లు, అధీకృత సంస్థ దోపిడీలతో డ్వాక్రా సంఘాల సభ్యులు తీవ్రంగా మోసపోతున్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో 1982లో డ్వాక్రా (డెవలప్‌మెంట్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియా)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలో 1587 గ్రూపులు ఉండగా, సుమారు 34 డ్వాక్రా సంఘాల సభ్యులు యానిమేటరు, అధీకృత ఏజంట్ల వల్ల మోసపోయారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమావేశాలు పెట్టి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

యానిమేటర్ నిర్వాకం.. రుణ మొత్తం స్వాహా..

2021లో ఒక యానిమేటర్ 25 డ్వాక్రా గ్రూపుల వద్ద నుంచి రూ.50 లక్షలను స్వాహా చేసింది. ఈ మొత్తంలో రూ.40 లక్షలు రికవరీ చేశారు. మిగిలిన రూ.10 లక్షలను ఆర్‌ఆర్ చట్టం ద్వారా వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. అలాగే స్త్రీ నిధికి సంబంధించి రూ.8 లక్షలను యానిమేటర్ నాగమణి స్వాహా చేయగా, వాటిలో రూ.6 లక్షలను ఆమె బాధితులకు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ఆమె అప్పట్లో నాలుగు రోజులు గడువు కోరి చెప్పా పెట్టకుండా ఇతర దేశానికి వెళ్లిపోవడంతో డ్వాక్రా మహిళలు తీవ్రంగా నష్టపోయారు. అయితే అధికారులు మిగిలిన మొత్తాన్ని ఆమె భర్త నుంచి వసూలు చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలను అడిగేందుకు అప్పటి డ్వాక్రా ఏపీఎం గంగాధర్‌ను వివరణ కోరగా ఫోన్‌కు అందుబాటులో లేరు.

అధీకృత ఏజంట్ ఘరానా మోసం..

మండలంలోని పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు పరిధిలో డ్వాక్రా ఋణ మొత్తాలను వసూలు చేసేందుకు ఇంటిగ్రా కంపెనీకి అధికారికంగా అనుమతులు ఇచ్చారు. బ్యాంక్ పరిధిలో ఉన్న తొమ్మిది గ్రూపుల సభ్యులు తీసుకున్న రుణ మొత్తాలను ఆ సంస్థ ఏజెంట్ పడమట మణికి చెల్లించారు. ఆ మొత్తాన్ని ఆమె స్వాహా చేయడంతో గత నెలలో బాధిత మహిళలు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. దీనితో బ్యాంకు మిత్ర కోఆర్డినేటర్ ఎల్.నరేష్, ఏరియా మేనేజర్ కె.రఘు చైనులు దర్యాప్తు చేసి రూ.18 లక్షలు స్వాహా అయినట్లు గుర్తించారు. ఆమె అకౌంట్‌లో ఉన్న రూ.7 లక్షలను బ్లాక్ చేయించి మిగిలిన రూ.11 లక్షలను వసూలు చేస్తామని, నగదు స్వాహాపై పోలీసు కేసు పెడతామని బాధితులకు నచ్చచెప్పారు. అయితే ఇప్పటికీ వారు బాధితులకు న్యాయం జరిగేలా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు.